# ఇరాన్ మిస్సైల్ లాంచర్స్ ధ్వంసం

### రెండు ఎఫ్-5 జెట్లనూ ధ్వంసం చేసిన ఇజ్రాయెల్



జెరూసలేం, జూన్ 22: ఇజ్రాయెల్ నగరాలే లక్ష్యంగా ఇరాన్ చేపడుతున్న బాలిస్టిక్ క్షిపణి దాడుల్ని అడ్డుకుంటున్నామని ఇజ్రాయెల్ రక్షణ బలగాలు (ఐడీఎఫ్) ప్రకటించాయి. పశ్చిమ ఇరాన్‌లోని ఆరు బాలిస్టిక్ మిస్సైల్ లాంచర్స్‌ను ధ్వంసం చేసినట్టు 'ఎక్స్' వేదికగా ఐడీఎఫ్ తెలిపింది. ఇరాన్‌కు చెందిన రెండు ఎఫ్-5 యుద్ధ విమానాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. ఇరాన్‌లోని డెజ్‌ఫుల్ విమానాశ్రయంలో ఎఫ్5 ఫైటర్ జెట్‌ను ధ్వంసం చేశామంటూ, బ్లాక్ అండ్ వైట్ వీడియో ఫుటేజ్‌ను ఇజ్రాయెల్ ఆదివారం విడుదల చేసింది. డెజ్‌ఫుల్, ఇస్ఫహాన్ విమానాశ్రయ కేంద్రాలు సహా పలు చోట్ల గగనతల దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. కాగా, యుద్ధంలో విమానాలు, ఇతర సామాగ్రి నష్టపోయినట్టు ఇరాన్ నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

**దాడులు కొనసాగుతాయి..**

ఇరాన్‌లో తమ టార్గెట్స్ పూర్తిచేస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆదివారం ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులతో ప్రపంచ దేశాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఈ దాడుల తర్వాత కూడా ఇరాన్‌లో మరిన్ని సైనిక ఆపరేషన్లు చేపడతామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. 'ఇరాన్‌లో మరికొన్ని లక్ష్యాలు ఉన్నాయి. వాటిని పూర్తి చేసేంత వరకు మిలిటరీ ఆపరేషన్ కొనసాగిస్తాం' అని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రతినిధి ఇఫ్పీ డిఫ్రిన్ చెప్పారు. 'ఆదివారం నాటి అమెరికా దాడులతో ఇరాన్ అణు శుద్ధీకరణ కార్యక్రమం పూర్తిగా నాశనమైందని చెప్పటం తొందరపాటే అవుతుంది. దీనిపై మరికొద్ది రోజుల్లో స్పష్టత వస్తుంది' అని ఆయన అన్నారు. ఇరాన్‌పై అమెరికా బాంబు దాడులకు దిగిన కొద్ది గంటల్లోనే, ఏకైక అణు విద్యుత్ కేంద్రం ఉన్న బషర్ ప్రావిన్స్‌లో ఆదివారం భీకరమైన పేలుడు సంభవించినట్టు ఇరాన్ మీడియా తెలిపింది. యాజ్డ్ ప్రావిన్స్‌లో వైమానిక దాడులు జరిగినట్టు ఇరానియన్ న్యూస్ ఏజెన్సీలు పేర్కొన్నాయి.

# రష్యా ఆదుకుంటుందా?

### హుటాహుటిన మాస్కోకు ఇరాన్ విదేశాంగ మంత్రి



ఇస్తాంబుల్, జూన్ 22: ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడులకు దిగటం ప్రపంచాన్ని నివ్వెరపర్చింది. అమెరికా దాడుల నుంచి తమను తాము కాపాడుకోగలమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి అన్నారు. ఆదివారం ఇస్తాంబుల్‌లో మీడియాతో మాట్లాడుతూ, తాను వెంటనే మాస్కోకు వెళ్లి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమవుతానని ప్రకటించారు. అమెరికాది ద్రోహపూరిత దౌత్యమని ఆరోపించారు. ఇకపై ఆ దేశంతో ఇరాన్ ఎలాంటి దౌత్యపరమైన చర్చలూ జరపబోదని ప్రకటించారు. అయితే ఇరాన్‌కు రష్యాను మిత్ర దేశంగా పేర్కొన్నారు. మాస్కోకు బయల్దేరి వెళ్తున్నానని, సోమవారం పుతిన్‌తో సమావేశమై చర్చలు జరుపుతానని అన్నారు. మరోవైపు, అమెరికా దాడుల నేపథ్యంలో రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం చాలా దేశాలు ఇరాన్‌కు అణు వార్‌హెడ్‌లు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.



టెల్ అవీవ్‌లో ఇరాన్ దాడికి దెబ్బతిన్న భవనాల వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు



హైఫాలో చిన్నారులను తరలిస్తున్న రెస్క్యూ వర్కర్

# ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం

- అమెరికా దాడుల నేపథ్యంలో ప్రతీకారంతో విరుచుకుపడ్డ ఇరాన్
- టెల్ అవీవ్ సహా పలు ప్రధాన నగరాలపై భీకరంగా దాడులు
- 80 మందికి పైగా గాయాలు.. విలువైన ఆస్తులకు భారీగా నష్టం

టెల్ అవీవ్: తమ అణు స్థావరాలపై అమెరికా దాడులు నిర్వహించిన కొన్ని గంటల తర్వాత ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర దాడులకు దిగింది. ఆదివారం ఉదయం సెంట్రల్, ఉత్తర ఇజ్రాయెల్ లక్ష్యంగా తొలిసారిగా బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. 30కి పైగా క్షిపణులతో ఇజ్రాయెల్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ దాడుల్లో 86 మంది గాయపడినట్టు ఇజ్రాయెల్ మీడియా వెల్లడించింది. టెల్ అవీవ్, హైఫా, నెస్ జియోనా, రిషన్ లిజియన్ ప్రాంతాలపై ఈ దాడులు జరిగాయి. దాడులతో టెల్ అవీవ్‌లోని పలు భవనాలు, అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతంలో దట్టమైన పొగ అలుముకుంది. రోడ్లపై వాహనాలు ఎక్కడబడితే అక్కడ చెల్లాచెదురుగా ఉన్నాయి. పెద్దయెత్తున పేలుళ్లు సంభవించాయని, పలు చోట తీవ్ర ఆస్తి నష్టం సంభవించిందని స్థానిక మీడియా తెలిపింది. ఇరాన్ క్షిపణి దాడులతో పలు నగరాలలో పెద్దయెత్తున సైరన్ మోతలు విన్పించాయి. క్షిపణి దాడులతో టెల్ అవీవ్‌లోని ఒక షాపింగ్ సెంటర్, బ్యాంక్, సెలూన్ ధ్వంసం కావడాన్ని చూశామని, పలు షాపులు దెబ్బతిన్నాయని, పగిలిన అద్దాలు, ధ్వంసమైన భవనాలతో అంతా అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు కొందరు తెలిపారు. భద్రతా దళాలు స్థానికులను అప్రమత్తం చేయడానికి ప్రయత్నిస్తుండగా, ఎర్త్‌మూవర్లు శిథిలాలను తొలగిస్తున్న దృశ్యాలు కన్పించాయి.

**తొలిసారి ఖైబర్ షేకెన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం**

ఇరాన్ ప్రయోగించిన 30 బాలిస్టిక్ క్షిపణులలో 10 లక్ష్యాలను ఛేదించాయి. తాము బెన్ గురియన్ విమానాశ్రయం, బయోలాజికల్ రిసెర్చి సెంటర్, ఆల్టర్నేటివ్ కమాండ్, కంట్రోల్ సెంటర్లు లక్ష్యంగా దాడులు చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. అధునాతన రక్షణ వ్యవస్థలను గందరగోళ పరచగల వివిధ రకాలుగా మారే క్షిపణులను దీనికి ఉపయోగించామని తెలిపింది. అలాగే , తాము అత్యంత అధునాతనమైన ఖైబర్-షేకెన్ బాలిస్టిక్ మిస్సైల్స్‌ను తొలిసారిగా ప్రయోగించినట్టు వెల్లడించింది. అన్ని విమానాలకు తమ గగనతలాన్ని మూసివేశామని, జోర్డార్, ఈజిప్టులతో ల్యాండ్ క్రాసింగ్ మాత్రమే తెరిచి ఉందని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ తాజా దాడులలో ఇరాన్ తన అతి పెద్ద పేలోడ్‌ను మోసుకెళ్లగల క్షిపణిని ఉపయోగించింది. ఖోర్రామ్‌షహర్-4 క్షిపణికి సంబంధించిన ఫైల్ ఫుటేజీని ఇరాన్ స్టేట్ టీవీ ప్రసారం చేసింది. నేటి దాడిలో దీనిని ప్రయోగించినట్టు తెలిపింది. ఖోర్రామ్‌షహర్ క్షిపణి పరిధి 2 వేల కిలోమీటర్లని, ఇది 1,500 కేజీల వార్ హెడ్ కలిగి ఉందని, ఇది బహుళ వార్‌హెడ్‌లను కూడా మోసుకెళ్లగలదని ఇరాన్ అధికారులు తెలిపారు.

### గగనతలాన్ని మూసేసిన ఇజ్రాయెల్

దుబాయ్: ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడుల నేపథ్యంలో తమ దేశం లోపల, బయట గగనతలాన్ని మూసేస్తున్నట్టు ఇజ్రాయెల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆదివారం ప్రకటించింది. మూసివేత ఎంత కాలం కొనసాగుతుందో వెల్లడించలేదు.

## ఇజ్రాయెల్ నుంచి 160 మంది భారతీయుల తరలింపు

జెరూసలెం, జూన్ 22: ఆపరేషన్ సింధూలో భాగంగా చేపట్టిన పౌరుల తరలింపు సంయుక్త ఆపరేషన్‌లో ఇజ్రాయెల్, జోర్డాన్‌ల నుంచి ఆదివారం మొదటి విడతగా 160 మంది భారతీయులను సురక్షితంగా భారత్‌కు తరలించారు. ఇజ్రాయెల్ గగనతలం మూసివేయడంతో తొలి విడతగా 160 మంది మన పౌరులను భూ మార్గం ద్వారా సరిహద్దు దాటించి జోర్డాన్‌కు చేర్చారు. అక్కడ ఇమ్మిగ్రేషన్ తనిఖీలు జరిపిన తర్వాత వారిని అమ్మన్ విమానాశ్రయానికి తరలించారు. వారిని సురక్షితంగా తీసుకురావడానికి అమ్మన్ నుంచి ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేసినట్టు భారత విదేశాంగ శాఖ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా, ఇరాన్ నుంచి ప్రత్యేక విమానం ద్వారా మరో 311 మంది భారతీయులు ఆదివారం ఢిల్లీకి చేరుకున్నట్టు భారత విదేశాంగ శాఖ తెలిపింది. దీంతోభారత్ చేరుకున్న పౌరుల సంఖ్య 1,428కి చేరింది.

## భారత్ గగనతలాన్ని అమెరికా వినియోగించ లేదు

### తప్పుడు వార్తలను ఖండించిన భారత్



న్యూఢిల్లీ, జూన్ 22: ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడుల కోసం అమెరికా యుద్ధ విమానాలు మన గగనతలాన్ని వినియోగించుకున్నాయని జరుగుతున్న ప్రచారాన్ని భారత్ ఖండించింది. ఇది తప్పుడు ప్రచారమని, ఇందులో వాస్తవం లేదని స్పష్టం చేసింది. భారత గగనతలాన్ని వాడుకునే అమెరికా విమానాలు ఇరాన్‌పై భీకర దాడికి పూనుకున్నాయంటూ పలు సామాజిక మాధ్యమాల్లో ఆదివారం ప్రచారం జరిగింది. దీనిని సమాచార ప్రసార శాఖ మంత్రిత్వ శాఖలోని పీఐబీ ఖండించింది.

# ఇరాన్ ముందున్న దారులేంటి?

- ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా ఆకస్మిక దాడులు
- ప్రతీకార మార్గాల కోసం అన్వేషిస్తున్న ఇరాన్



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలోకి ఎంటరైన అమెరికా.. ఇరాన్ అణుస్థావరాలపై భీకరదాడులకు దిగింది. ఈ దెబ్బతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. మరోవైపు, అమెరికా దాడిపై తీవ్రంగా స్పందించిన ఇరాన్.. అమెరికాకు మర్చిపోలేని గుణపాఠం చెప్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఇరాన్ ఎన్ని రకాలుగా ప్రతీకారం తీర్చుకోవచ్చన్న దానిపై నిపుణులు పలు అంశాలను తెరపైకి తెచ్చారు.

**హర్మూజ్ జలసంధికి అడ్డుకట్ట**

ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతానికిపైగా హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతున్నది. ఇప్పుడు ఇరాన్ దీనిని చక్కని అవకాశంగా వినియోగించుకునే వీలుంది. ఇరాన్ కనుక ఇప్పుడు దీనిని మూసివేస్తే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉంది.

**అమెరికా మిలటరీ బేస్‌లపై దాడులు**

ఈ ప్రాంతంలో అమెరికా 10 వేల మంది సైనికులను మోహరించింది. వాటిలో ఖతర్, బహ్రెయిన్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అరబ్ గల్ఫ్ దేశాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ కంటే ఇవి చాలా దగ్గరగా ఉన్నాయి. ఈ స్థావరాలు కూడా ఇజ్రాయెల్ మాదిరిగానే అధునాతన వాయు రక్షణ వ్యవస్థను కలిగి ఉన్నాయి. కానీ, క్షిపణి, సాయుధ డ్రోన్ల ద్వారా దాడి చేస్తే హెచ్చరిక సమయం చాలా తక్కువ. అక్కడికి అనేక వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇజ్రాయెల్ కూడా అడ్డుకోలేకపోవచ్చు. అమెరికా బేస్‌లను ఇరాన్ లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్ దాడులతో విరుచుకుపడే అవకాశం ఉన్నది. 2019లో సౌదీ అరేబియాలోని రెండు చమురు క్షేత్రాలు, మౌలిక సదుపాయాలపై జరిగిన దాడిని గుర్తుచేస్తూ ఇరాన్ మళ్లీ ఆ తరహా దాడులకు దిగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**మిత్రులను సమన్వయం చేసుకోవడం**

ఇరాన్‌కు అనుబంధంగా పనిచేస్తున్న హౌతీలు (యెమన్), హిజ్బొల్లా (లెబనాన్), హమాస్, ఇరాక్‌లోని మిలీషియా వంటి బలగాలను ఉపయోగించుకోవడం ద్వారా పరోక్షంగా అమెరికాకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ఇవి తమ భూభాగాల నుంచి ఇజ్రాయెల్‌పై దాడులకు దిగాయి. 1990లలో అర్జెంటినాలోని యూదు కమ్యూనిటీ సెంటర్‌పై దాడిని గుర్తుచేస్తున్నారు. ఈ దాడికి ఇరాన్, హిజ్బొల్లానే కారణమన్న ఆరోపణలున్నాయి.

**అణ్వాయుధాల దిశగా అడుగులు**

ఇరాన్ తన కార్యక్రమం శాంతియుతమైనదని చెప్తున్నది. కానీ, యురేనియంను 60 శాతం వరకు శుద్ధి చేసిన ఏకైక అణ్వాయుధేతర దేశం ఇదే. ఇది ఆయుధ గ్రేడ్ స్థాయిలను 90 శాతానికి పెంచుకునేందుకు ఒకే ఒక్క అడుగు దూరంలో ఉన్నది.

## ఖమేనీ వారసులుగా ముగ్గురి పేర్లు

### ప్రతిపాదించిన ఇరాన్ సుప్రీం లీడర్



టెహ్రాన్, జూన్ 22: ఒక వేళ తాను మరణిస్తే తన వారసులుగా ముగ్గురు సీనియర్ మతాధికారుల పేర్లను ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ ప్రతిపాదించారని ఇరాన్ అధికారులను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం సుప్రీం లీడర్ కనుక మరణిస్తే 88 సభ్యుల మతాధికారుల సంస్థ అయిన అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ నేతృత్వంలో వారసుని ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తారు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత, ఖమేనీని వారసుడిగా ఎంపిక చేసిన 1989లో ఒకే ఒక్కసారి మాత్రమే ఈ విధానాన్ని వినియోగించారు. గత శుక్రవారం ఇజ్రాయెల్ ఆకస్మిక దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇస్లామిక్ రిపబ్లిక్‌ను పరిరక్షించడానికి ఖమేనీ అసాధారణ నిర్ణయాలు తీసుకున్నారు. ఖమేనీ కుమారుడు, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌తో దగ్గర సంబంధాలున్న మతాధికారి, ఇరాన్ చీఫ్‌గా తదుపరి బాధ్యతలు చేపడతారని ప్రచారంలో ఉన్న మొజతాబా ఖమేనీ మాత్రం ఆయతొల్లా ఖమేనీ ఎంపిక చేసిన వారసులలో లేరని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. కాగా, ఖమేనీ వారసుడిగా భావించిన ఇరాన్ మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ 2024లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే.

### అత్యంత సురక్షిత బంకర్‌లోకి ఖమేనీ

టెహ్రాన్: ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా బాంబు దాడులతో విరుచుకుపడిన వేళ ఇరాన్ చీఫ్ ఖమేనీ ఎక్కడ ఉన్నారన్న ప్రశ్న అందరిలో తలెత్తుతున్నది. అయితే ఆయన అత్యంత సురక్షితమైన ఒక అండర్‌గ్రౌండ్ బంకర్‌లో ఉన్నారని, ఆయనపై దాడి జరిగేందుకు అవకాశాలున్నందున ఆయన ఉంటున్న ప్రాంతం ఎలాంటి సిగ్నళ్లకు అందకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ వ్యవస్థను కూడా నిలిపివేశారని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. అత్యంత సన్నిహిత వ్యక్తులు కొందరు ఆయనకు ఎప్పటికప్పుడు యుద్ధ సమాచారాన్ని అందజేస్తున్నారు.



## అమెరికా నగరాల్లో హై అలర్ట్

### న్యూయార్క్, వాషింగ్టన్‌కు అదనపు బలగాలు

వాషింగ్టన్, జూన్ 22: ఇరాన్ ప్రతీకార దాడులకు దిగుతుందన్న అనుమానాలతో అమెరికా నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. న్యూయార్క్, వాషింగ్టన్ సహా ముఖ్యమైన నగరాల్లో అదనపు బలగాల్ని మోహరిస్తున్నారు. సాంస్కృతికంగా, మతపరంగా, దౌత్యపరంగా ముఖ్యమైన అన్ని కేంద్రాల్లో అదనపు బలగాల్ని మోహరిస్తున్నట్టు న్యూయార్క్ పోలీస్ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై అమెరికా బాంబులు జారవిడిచింది. దీనికి ప్రతీకారంగా ఇరాన్ ప్రతీకార దాడులకు దిగొచ్చన్న అనుమానాల నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది.

## విదేశాల్లో ఇరానియన్ల ఫోన్ కాల్స్‌కు అంతరాయం!

టెహ్రాన్, జూన్ 22: ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చిన వేళ, విదేశాల్లో నివసిస్తున్న ఇరానియన్లు ఫోన్ కాల్స్ చేసుకోవటంలో ఆటంకాలు ఏర్పడ్డాయి. స్వదేశంలో (ఇరాన్) ఉన్న తమ స్నేహితులు, బంధువులకు ఫోన్ కాల్స్ చేయగా, వింతైన, విచిత్రమైన రోబోటిక్ సందేశాలతో అంతరాయాలు ఏర్పడ్డాయి. 'కండ్లు మూసుకొని శాంతి, సంతోషం అందించే వాతావరణంలో తమను తాము చూసుకోవాలి' అంటూ 90 సెకన్లపాటు ఆ సందేశం వెలువడింది. కొన్ని సందర్భాల్లో, 'హలో!హలో! ఎవరు కాల్ చేస్తున్నారు? నేను మీ మాట వినలేకపోతున్నా. మీరు ఎవరో నాకు తెలియదు' అని చెప్పే ఆటోమేటెడ్ వాయిస్‌తో ఫోన్ కాల్స్ నిలిచిపోయాయి. భద్రతాపరమైన కారణాలతో ఇరాన్ గత బుధవారం ఇంటర్నెట్‌పై నియంత్రణలు విధించింది. దీంతో విదేశాల్లోని ఇరానియన్లు వాట్సాప్ కాకుండా, ప్రత్యక్ష ఫోన్ కాల్స్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇలాంటి ఫోన్ కాల్స్‌కు వింతైన, ఆటోమేటెడ్ వాయిస్ సందేశాలు వెలువడినట్టు తెలిసింది. ల్యాండ్‌లైన్ ద్వారా ఫోన్ కాల్స్ చేసిన వారికి ఈ పరిస్థితి ఎదురుకాలేదు. యుద్ధ సంక్షోభం ఉధృతంగా మారిన వేళ, ఫోన్ కాలింగ్‌లో తమకు ఎదురైన అనుభవం ఇరానియన్లను విస్మయానికి గురిచేసింది. కొంత మంది సైబర్ దాడి, మరికొంత మంది టెక్నికల్ లోపంగా భావించారు.

## 37 గంటలు బాంబర్లు ప్రయాణం!

వాషింగ్టన్, జూన్ 22: ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ఉపయోగించిన యూఎస్ బీ-2 స్టెల్త్ బాంబర్లు నిరాఘాటంగా 37 గంటలపాటు ప్రయాణించాయని ఓ అమెరికా అధికారి వెల్లడించారు. మార్గమధ్యంలో పలుమార్లు ఆకాశంలోనే వీటిలో ఇంధనం నింపారని చెప్పారు. ఫోర్డో, నతాంజ్ అణు శుద్ధి కేంద్రాలపై దాడికి బంకర్ బస్టర్ బాంబులను వినియోగించారు. అమెరికాలోని మిస్సోరిలో బయలుదేరిన ఈ బాంబర్లు 37 గంటల అనంతరం నిర్దేశిత లక్ష్యానికి చేరుకున్నాయి. మొత్తం ఏడు బాంబర్లు ఫోర్డో, నతాంజ్ అణు శుద్ధి కేంద్రాలపై 14 బంకర్ బస్టర్లను జారవిడిచాయి. ఈ బాంబర్లు మోసుకొచ్చిన ఒక్కో జీబీయూ-57 బంకర్ బస్టర్ బాంబు బరువు 13,600 కిలోలు. దాదాపు 20 అడుగుల పొడవు ఉండే ఈ బాంబులు పర్వతాలను సైతం చీల్చుకుంటూ 60 మీటర్ల లోతు వరకు చొచ్చుకుపోయి పేలతాయి. ఒక్కో బాంబు ఖరీదు 20 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఫోర్డో అణు శుద్ధి కేంద్రాన్ని ఇరాన్ ఓ పర్వతం కింద సుమారు 300 అడుగుల లోతున నిర్మించింది. అక్కడి నుంచి మరింత లోతులో యురేనియంను శుద్ధిచేసే కేంద్రం ఉన్నట్టు అంచనా.


## రేడియోధార్మికత వెలువడ లేదు

### ప్రజలు సురక్షితం: ఇరాన్

దుబాయ్, జూన్ 22: అమెరికా దాడుల వల్ల తమ అణు కేంద్రాల నుంచి రేడియోధార్మికత లీకేజ్ అన్నది ఎక్కడా లేదని ఇరాన్ ప్రకటించింది. ఇస్ఫాహన్, ఫోర్డో, నతాంజ్‌లలోని అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని అమెరికా గగనతల దాడులు జరిపిందని, అయితే రేడియోధార్మికత వెలువడినట్టు రేడియేషన్ డిటెక్టర్స్ నమోదు చేయలేదని ఇరాన్‌కు చెందిన 'నేషన్ న్యూక్లియర్ సేఫ్టీ సిస్టం సెంటర్' ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అణు కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నివసించేవారికి ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేసింది.

# లక్ష మంది టెకీలపై వేటు!

- ఈ సంవత్సరంలోనూ భారీగా తొలగింపులు
- వేల మందిని ఇంటికి పంపుతున్న దిగ్గజ సంస్థలు




న్యూఢిల్లీ, జూన్ 22: టెక్ రంగంలో ఉద్యోగాల ఊచకోత ఈ ఏడాది కొనసాగుతున్నది. ఇంటెల్, మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలను మొదలుకొని స్టార్టప్‌ల వరకూ భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే 62 వేల మందికిపైగా ఇంటికి పంపాయి. ఇప్పటికే ప్రకటించిన లేఆఫ్‌లను పరిశీలిస్తే ఈ ఏడాది తొలగించబోయే ఉద్యోగుల సంఖ్య లక్ష దాటింది. ప్రధాన టెక్ కంపెనీలన్నీ తమ వ్యాపార సరళి, నిర్వహణలో అనూహ్య మార్పులను చేపడుతుండటంతో, సెమికండక్టర్ తయారీ రంగం నుంచి సోషల్‌మీడియా రంగం వరకు ఉద్యోగాల తొలగింపు మొదలైంది. దీంతో ఉద్యోగాలు కోల్పోయిన వేలాది మంది పోటీ ప్రపంచంలో కొత్త అవకాశాల కోసం వెదుక్కునే పరిస్థితి ఏర్పడింది. హార్డ్‌వేర్ ఉత్పత్తులను తయారుచేసే ఇంటెల్, ఫిన్‌టెక్ కంపెనీ బ్లాక్, బ్లూ ఆరిజన్ వంటి స్పేస్ కంపెనీలు కూడా తమ సిబ్బందిని తగ్గించుకునే ప్రణాళికను ప్రకటించాయి. ఈ ఏడాది ఆయా టెక్ కంపెనీలు తొలగిస్తున్న ఉద్యోగుల సంఖ్య ఈ విధంగా ఉంది.

| | | | |
|---|---|---|---|
| ఇంటెల్ **21,700**కుపైగా | పానసానిక్ **10,000** | మైక్రోసాఫ్ట్ **6,500**కుపైగా | మెటా **72,000**కుపైగా |
| హెచ్‌పీ **2,000** | బ్లూఆరిజన్ **1,000** | సేల్స్‌ఫోర్స్ **1,000**కుపైగా | వర్క్‌డే **1,750** |
| నిస్సాన్ **20,000**(2027నాటికి) | బ్లాక్ **1,000** | స్టార్‌బక్స్ **1,100** | పోర్ష్ **3,900** |

## భారత్‌లో మహిళలు ఒంటరిగా తిరగొద్దు

- లైంగిక దాడులు పెరుగుతున్నాయి
- లెవల్-2 ట్రావెల్ అడ్వైజరీ జారీచేసిన అమెరికా

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): భారతదేశంలోని పర్యాటక, ఇతర ప్రదేశాలలో లైంగిక నేరాలు పెరుగుతున్నాయని, ఆయా ప్రాంతాలకు మహిళలు ఒంటరిగా వెళ్లొద్దని అమెరికా ప్రభుత్వం తమ పౌరులను హెచ్చరించింది. ఈ మేరకు లెవల్-2 ట్రావెల్ అడ్వైజరీ పేరిట జూన్ 16న తమ దేశ పౌరులు, ఉద్యోగులకు తాజా మార్గదర్శకాలు జారీ చేసింది. 'భారత్‌లో వేగంగా పెరుగుతున్న నేరాలలో అత్యాచారం' ఒకటని పేర్కొంటూ అక్కడి పర్యాటక ప్రదేశాలు, రవాణా కేంద్రాలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ తదితర ప్రాం తాలను ఉగ్రవాదులు టార్గెట్‌గా ఎంచుకొని, ఎటువంటి హెచ్చరికలు లేకుండా హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నది. బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, మేఘాలయ, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో రాజధాని నగరాలను తప్ప ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే అమెరికన్ ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యే క అనుమతి పొందాలని తెలిపింది. జరిమానాలు దృష్టిలో పెట్టుకొని ఇండియా-నేపాల్ సరిహద్దు దాటొద్దని కూడా హెచ్చరించింది.



*శాంతి దశాబ్దానికి గుర్తుగా..*

## కొలంబియాలో యోగా వేడుకలు

### *హాజరైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్*

*బొగొటా, జూన్ 22: కొలంబియా రాజధాని బొగొటాలోని ప్రఖ్యాత శాంటా మారియా ప్లాజాలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేలాదిమంది యోగా సాధకులు, ఔత్సాహికులు పాల్గొన్న ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ప్రపంచ ప్రఖ్యాత యోగా గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ హాజరయ్యారు. సరిగ్గా ఓ దశాబ్దం కిందట కొలంబియా ప్రభుత్వం, తీవ్రవాద ఫార్క్ గెరిల్లా సంఘాలు శాంతి ఒప్పందం చేసుకోవటంలో గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. చారిత్రకమైన ఈ ఘటనకు 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా.. ఈ ఏడాది యోగా దినోత్సవ వేడుకలు కొలంబియాలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఇది కొలంబియాలో శాంతి దశాబ్దానికి గుర్తుగా నిలిచింది.*

## వానల్లోనూ నక్సలైట్లను నిద్రపోనివ్వం

- చర్చలు లేవు.. లొంగిపోవాల్సిందే
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

రాయ్‌పూర్, జూన్ 22(పీటీఐ): వానకాలంలోనూ నక్సలైట్లను నిద్ర పోనివ్వబోమని, నక్సల్ ఏరివేత ఆపరేషన్ కొనసాగుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. నక్సలైట్లతో చర్చలు జరిపేది లేదని స్పష్టంచేశారు. వారు ఆయుధాలు వీడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ అటల్‌నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) క్యాంపస్‌తోపాటు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. ప్రతిసారీ వానకాలంలో నదులు ఉప్పొంగడం వల్ల దట్టమైన అడవుల్లో నక్సలైట్ల ఏరివేత కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతున్నదని, దీంతో వారు ఊపిరి పీల్చుకుంటున్నారని వ్యాఖ్యానించారు. అయితే, ఈసారి వారికి అలాంటి అవకాశం లేదని, యాంటీ నక్సల్ ఆపరేషన్స్ కొనసాగిస్తామని, 2026 మార్చి 31 నాటికి నక్సల్ నిర్మూలన టార్గెట్‌ను చేరుకుంటామని చెప్పారు. నక్సలైట్లతో చర్చల అవసరం లేదని తేల్చి చెప్పారు. ఆయుధాలు వీడి, జన జీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయే నక్సలైట్లకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేరుస్తామని చెప్పారు.